క్లుప్తంగా

నేడు శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమం

మాదాపూర్‌: మాదాపూర్‌లోని శిల్పారామంలో ఆదివారం సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా సాయంత్రం 5.30 గంటలకు ప్రత్యేక భరతనాట్య ప్రదర్శన నిర్వహిస్తారు. శిల్పారామంలోని ఆంపీ థియేటర్‌లో బెంగళూరుకు చెందిన నాట్య గురువు కష్టకలలయ ఆధ్వర్యంలో సునితాసుకు మారన్‌ భరత నాట్య ప్రదర్శన నిర్వహిస్తారు.

నేడు 'సంత' జరిగే ప్రాంతాలు

గచ్చిబౌలి: వారాంతపు సంత నిర్వహణలో భాగంగా శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలో ఆదివారం తారానగర్‌, గుల్‌మోహర్‌పార్కుకాలనీ, నానక్‌రాంగూడ, మదీనాగూడ, గోకుల్‌ ఫ్లాట్స్‌ పెద్ద చర్చి వద్ద నిర్వహిస్తారు. ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు నిర్వహించే ఈ సంతలలో సరసమైన ధరలకు తాజా కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, నిత్యావసరాలు, వివిధ రకాల దుస్తులు, ఇతర వస్తువులు లభిస్తాయి.

అన్నమయ్యపురంలో సంగీత కచేరి



మాదాపూర్‌: మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో ప్రతి వారం నిర్వహించే అన్నమస్వరార్చనలో భాగంగా శనివారం సీతారార్చణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గంటి విజయలక్ష్మి సితార వాయిద్యంతో సంకీర్తనలను ఆలపించి సందర్శకులను ఆకట్టుకున్నారు. అన్నమయ్య సంకీర్తనలను ఆలాపించి అలరించారు. తబలాపై పాండుగ మురళీ సంగీత సహకారాన్ని అందించారు. సితారార్చన చేసిన కళాకారులను డాక్టర్‌ శోభరాజు జ్ఞాపికతో సత్కరించారు.

బాస్కెట్‌బాల్‌ ఉమెన్స్‌ క్రీడాకారుల ఎంపిక

మాదాపూర్‌: ఎలైట్‌ ఉమెన్స్‌ ప్రో బాస్కెట్‌బాల్‌ లీగ్‌ ఎంపికను చేశారు. మాదాపూర్‌లోని డ్రీమ్‌ బాస్కెట్‌బాల్‌ అకాడమీలో ఎంపిక కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. భారతదేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి బాస్కెట్‌బాల్‌ క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్టు నిర్వాహకులు సన్నీ భండార్కర్‌ తెలిపారు. ఇప్పటి వరకు 250 ఎంట్రీలు వచ్చినట్లు తెలిపారు. ఇతర నగరాలలో ట్రై అవుట్‌లు జూన్‌ 16 నుంచి జూన్‌ 18 వరకు ముంబైలో ప్రారంభమవుతాయన్నారు. కోల్‌కత్తాలో జూన్‌ 23 నుంచి 25 వరకు ఎంపిక నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అల్లీనగర్‌ను ప్రత్యేక పంచాయతీగా ప్రకటించాలి

గ్రామస్తుల డిమాండ్‌

జిన్నారం(పటాన్‌చెరు): గడ్డపోతారం పంచాయతీ పరిధిలోని అల్లీనగర్‌ను ప్రత్యేక గ్రామ పంచాయతీ ప్రకటించాలని డిమాండ్‌ చేస్తూ శనివారం అల్లీనగర్‌ గ్రామస్తులు భారీ ర్యాలీ చేపట్టారు. ఇటీవల గ్రామస్తులపై పోలీసుల దాడులు చేయటం, గ్రామకంఠం స్థలంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్‌ విగ్రహాన్ని తొలగించడాన్ని నిరసించడంతో పాటు అల్లీనగర్‌ను పంచాయతీ చేయాలనే డిమాండ్‌తో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ తమ గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీ చేస్తే అన్నివిధాలుగా అభివృద్ధి చేసుకుంటామన్నారు. గ్రామకంఠం భూములను పరిశ్రమలకు కేటాయిస్తే సహించేదిలేదని హెచ్చరించారు. అనంతరం గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌ ఎంపీ అశోక్‌, వార్డుసభ్యుడు వీరేశంగౌడ్‌, నాయకులు బాలుగారి శ్రీనివాస్‌, బాలయ్య, కార్తీక్‌, అర్జున్‌, భాస్కర్‌, గోపాల్‌ పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్‌ చిత్రపటానికి క్షీరాభిషేకం

జిన్నారం(పటాన్‌చెరు): వికలాంగులకు అందజేస్తున్న పింఛన్‌ను పెంచేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవటంతో జిన్నారంలో బీఆర్‌ఎస్‌ నాయకులు వికలాంగులతో కలిసి శనివారం సీఎం కేసీఆర్‌ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా సీఎం కేసీఆర్‌ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు సంజీవ, శ్రీనివాస్‌యాదవ్‌, శ్రీనివాస్‌గౌడ్‌, లింగం, శ్రీధర్‌గౌడ్‌, నర్సింగ్‌రావు, వీరేశ్‌ పాల్గొన్నారు.

విరాళం అందజేత

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని ఊట్ల గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్పస్వామి దేవాలయ నిర్మాణానికి కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు వడ్డె కృష్ణ రూ.51వేల విరాళాన్ని శనివారం ఆలయ నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో వైస్‌ ఎంపీపీ గంగు రమేశ్‌, సర్పంచ్‌ ఆంజనేయులు, మాజీ సర్పంచ్‌ శివరాజ్‌, ఉప సర్పంచ్‌ రవి పాల్గొన్నారు.

నిరుపయోగం.. స్ట్రీట్‌ వెండర్స్‌ దుకాణాలు

- వ్యాపారులకు కేటాయించని వైనం
- రూ.90 లక్షలతో నిర్మాణం
- శిథిలావస్థకు చేరుకుంటున్న స్టాల్స్‌
- పట్టించుకోని అధికారులు



చందానగర్‌: జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్ట్రీట్‌ వెండర్స్‌ దుకాణాలు (వీధి వ్యాపారుల సముదాయ దుకాణాలు) అలంకారప్రాయంగా మారాయి. అధికారుల నిర్లక్ష్యం.. నిర్వహణ లోపంతో లక్షల రూపాయాల ప్రజాధనం వృథా అవుతోందని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎప్పటికప్పుడు వినూత్న పథకాల పేరిట నిధులు దుర్వినియోగం అవుతున్నాయని, ఇది అధికారులకు పరిపాటిగా మారింది. టాయిలెట్స్‌, వాటర్‌ ఏటీఎం ప్లాంట్స్‌, మోడల్‌ మార్కెట్ల నిర్మాణం చేపట్టి వాటి నిర్వహణ గాలికొదిలేయడంతో నిధులు దుర్వినియోగం చేస్తున్నారు. తాజాగా వీధి వ్యాపారుల కోసం ఏర్పాటు చేసిన మార్కెట్‌ కూడా అదే జాబితాలో చేరుతోంది.

- చందానగర్‌లోని జాతీయ రహదారి ఇరువైపుల సర్వీస్‌ రోడ్డు, మంజీరా రోడ్డులో చిరు వ్యాపారుల వల్ల ట్రాఫిక్‌ సమస్య తీవ్రమవుతోంది. పార్కింగ్‌, రద్దీ సమస్యను అధిగమించడానికి జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో చందానగర్‌లోని హుడా కాలనీ ఎంఎంటీఎస్‌ రైల్వే స్టేషన్‌ వద్ద నూతనంగా వీధి వ్యాపారుల సముదాయ దుకాణాలను ఏడాదిన్నర క్రితం ప్రారంభించారు.
- ఈ వీధి వ్యాపారుల సముదాయాలు రూ.90 లక్షలతో నిర్మాణం చేపట్టారు.
- ప్రజా ప్రతినిధులు, సర్కిల్‌ అధికారులు ఏనిమిది నెలల క్రితం ప్రారంభోత్సవం చేశారు. అన్ని హంగులతో వీధి వ్యాపారుల సముదాయాన్ని నిర్మించారు.
- చిరు వ్యాపారులకు అవగాహన కల్పించి ఆ ప్రాంతంలో వ్యాపారాలు ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు తీసుకోకుండా అధికారులు నిర్లక్ష్యం వహించడంతో ప్రస్తుతం ఈ దుకాణాలు నిరుపయోగంగా మారాయి.
- ప్రస్తుతం ఏర్పాటు చేసిన దుకాణాల ప్రాంతంలో చెత్తా చెదారం దర్శనమిస్తోంది. దుకాణాల ముందు మురుగు నిలిచి ఉండడంతో దుర్వాసన వెదజల్లుతోంది.
- అధికారులు సరైన ప్రణాళిక లేకుండా అనువైన స్థలాన్ని కేటాయించకపోవడంతో వ్యాపారులు ఇక్కడికి వచ్చేందుకు ఆసక్తి చూపడం లేదని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ వీధి వ్యాపారుల సముదాయం హుడా కాలనీవాసులకు మాత్రమే దగ్గరగా, అనువుగా ఉంది.
- చందానగర్‌లోని ఎంఎంటీఎస్‌ రైల్వేస్టేషన్‌ అవతలి వైపు పాపిరెడ్డి కాలనీ, రాజీవ్‌ గృహకల్ప, సురభీ కాలనీలు ఉన్న రైల్వే పట్టాలు దాటి ఈ సముదాయాలకు వచ్చి కొనుగోలు చేసేందుకు జంకుతున్నారు.
- దీంతో పాటు వివిధ కాలనీల్లో వారాంతపు సంతలు ఎక్కడపడితే అక్కడ రోడ్లపై నిర్వహిస్తుండడంతో ఆయా కాలనీవాసులు కాలనీల్లోని వినియోగదారులు వారాంతపు సంతల్లోనే కూరగాయాలు, ఇతర వస్తువులు కొనుగోలు చేస్తున్నారు.
- ఏర్పాటు చేసిన వీధివ్యాపారుల సముదాయం వీధి చివర ఏర్పాటు చేయడంతో ఎక్కువగా వ్యాపారులు కానీ, వినియోగదారులు వచ్చేందుకు ఆసక్తి చూపడం లేదని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. దీంతో నిర్మాణం చేపట్టి ఏనిమిది నెలలు గడుస్తున్నా కూడా నిరుపయోగంగా పడి ఉంది.
- హుడా కాలనీలోనే ఐదేళ్ల క్రితం మోడల్‌ మార్కెట్లు నిర్మించి వ్యాపారస్తులకు కేటాయించకపోవడంతో ఈ మార్కెట్లు కూడా నిరుపయోగంగా పడి ఉన్నాయి.
- ప్రారంభించిన కొన్ని రోజులు కొద్ది వ్యాపారస్తులు వచ్చిన వ్యాపారాలు నడవకపోవడంతో వారు కూడా అక్కడి నుంచి వెళ్లిపోయారు. సుమారు 150 మంది వరకు కూరగాయాలు, పాలు తదితర వ్యాపారాలు నిర్వహించుకోవచ్చు.
- వ్యాపారులను గుర్తించడం వారికి గుర్తింపు కార్డులు ఇవ్వడం కొత్త మార్కెట్‌లో స్టాల్స్‌ కేటాయించడంలో అధికారుల చిత్తశుద్ధి లోపించిందని ఆరోపిస్తున్నారు.
- చుట్టు ప్రక్కల ప్రాంతాల వారికి స్టాల్స్‌ కేటాయించకుండా ఎక్కడ నుండో వచ్చిన వారికి కేటాయించారని స్థానికులు ఆరోపిస్తున్నారు.
- చందానగర్‌ జాతీయ రహదారి ఇరువైపుల సర్వీస్‌ రోడ్డు, మంజీరా రోడ్డులో అనేక మంది వీధి వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. కొంత మంది వ్యక్తులు స్థలాలను అక్రమించి అద్దెకు ఇస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. రోడ్ల ప్రక్కన వ్యాపారాలు చేసుకునేవారు ఈ వీధి వ్యాపారుల సముదాయానికి వస్తే ఇక్కడ మార్కెట్‌ నడవక గతంలో ఉన్న స్థలంతో పాటు కొత్తవాళ్లు ఏర్పాటు చేసుకునే అవకాశం ఉందని, ఇది అది కాకుండా పోతాయని భయాందోళన చెందుతున్నారు.
- అధికారులు రోడ్డు పై ట్రాఫిక్‌ తగ్గించేందుకు ఈ వ్యాపార సముదాయాలు దోహదపడుతాయి. అధికారులు ఈ స్టాల్స్‌ను వ్యాపారులకు కేటాయించి వ్యాపారాలు చేసుకునే విధంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. లేకపోతే మోడల్‌ మార్కెట్స్‌ లాగానే ఈ వీధి వ్యాపారుల సముదాయాలు కూడా మూలన పడే అవకాశం ఉందని స్థానిక ప్రజలు వాపోతున్నారు.

నాలా విస్తరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ తదితరులు

మియాపూర్‌: నాలా విస్తరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ప్రభుత్వ విప్‌, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. చందానగర్‌ డివిజన్‌ పరిధిలోని దీప్తీశ్రీనగర్‌ కాలనీలో నాలా విస్తరణలో భాగంగా సీబీఆర్‌ ఎస్టేట్‌ వద్ద రూ.52 లక్షలతో అదనంగా చేపడుతున్న కల్వర్టు విస్తరణ, సత్యనారాయణ ఎన్‌క్లేవ్‌ వద్ద రూ.90 లక్షల అంచనాతో చేపడుతున్న నాలా విస్తరణ పనులను జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్‌ అధికారులతో కలిసి శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దీప్తీశ్రీనగర్‌ నాలా విస్తరణ పనుల్లో భాగంగా ప్రజా సౌకర్యార్థం, వరద నీరు సాఫీగా సాగేలా కల్వర్టును అదనంగా విస్తరణ చేపట్టామన్నారు. అదేవిధంగా సత్యనారాయణ ఎన్‌క్లేవ్‌ వద్ద అసంపూర్తిగా మిగిలిపోయిన కొద్దిపాటి నాలా విస్తరణ పనులను వెంటనే పూర్తి చేయాలని, రాబోయే వర్షకాలాన్ని దృష్టిలో పెట్టుకుని నాలాల విస్తరణ పనులను వేగవంతం చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ శివప్రసాద్‌, మాదాపూర్‌ డివిజన్‌ బీఆర్‌ఎస్‌ పార్టీ నాయకులు సీతారామయ్య, పూర్ణ చందర్‌రావు, సుబ్బారావు, సుబ్రమణ్యం, కోటేశ్వర్‌రావు, కిరణ్‌ తదితరులు పాల్గొన్నారు.

హైటెక్స్‌లో హోమ్‌ హంట్‌ ఎక్స్‌పో-2023 ప్రారంభం



ఎక్స్‌పోను ప్రారంభించిన మేయర్‌ గద్వాల్‌ విజయలక్ష్మి, ఎంపీ రంజిత్‌రెడ్డి

మాదాపూర్‌: హైదరాబాద్‌ రియల్‌ ఎస్టేట్‌ హబ్‌గా గుర్తింపు పొందిందని చేవేళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి పేర్కొన్నారు. మాదాపూర్‌లోని హైటెక్స్‌లో ఏర్పాటు చేసిన ది టైమ్స్‌ హోమ్‌ హంట్‌ ఎక్స్‌పో 2023ని హైదరాబాద్‌ నగర మేయర్‌ గద్వాల విజయలక్ష్మితో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరంలో రెసిడెన్సియల్‌, ఆఫీస్‌ స్పేస్‌ ఎక్కువగా పుంజుకుంటుందన్నారు. హైదరాబాద్‌ అత్యంత నివాసయోగ్యమైన, ఆకర్షణీయమైన నగరంగా గుర్తింపు పొందుతుందన్నారు. తెలంగాణ ఏర్పాటైన వెంటనే రాష్ట్రంలో గ్రామీణాభివృద్ధిపై, శాంతి సామరస్యాలపై నగరంలో దృష్టి సారించామన్నారు. రెండు రోజులు పాటు నిర్వహించనున్న ప్రదర్శనలో పాల్గొన్న 36 ప్రముఖ బిల్డర్లు, 100కిపైగా రియల్‌ ఎస్టేట్‌ ప్రాజెక్టులు, ప్రీమియం వెంచర్లు పాల్గొన్నారు.

వీరాంజనేయస్వామి ఆలయంలో ఎమ్మెల్యే పూజలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: అమీన్‌పూర్‌ మండలం పటేల్‌గూడ గ్రామ పరిధిలోని హరివిల్లు టౌన్‌ షిప్‌ కాలనీలో నూతనంగా నిర్మించిన వీరాంజనేయస్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న విగ్రహ ప్రతిష్ఠాపనలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ భక్తి భావాన్ని అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ దేవానందం, జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, సర్పంచ్‌ నితీషశ్రీకాంత్‌, కాలనీ వాసులు పాల్గొన్నారు.

'నిపుణ్‌ భారత్‌ మిషన్‌' సమావేశాల్లో రాయదుర్గం జెడ్పీహెచ్‌ఎస్‌ హెచ్‌ఎం



సర్టిఫికెట్‌ అందుకుంటున్న తాజ్‌బాబు

రాయదుర్గం: 'నిపుణ్‌ భారత్‌ మిషన్‌'సమావేశాల్లో రాయదుర్గంలోని జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్‌ కే తాజ్‌బాబు పాల్గొన్నారు. భారత ప్రభుత్వం 2026వ సంవత్సరం లోపు మూడో తరగతి చదివే పిల్లలందరూ భాష, సంఖ్యా సామర్థ్యాల్లో పూర్తి స్థాయిలో నైపుణ్యాన్ని సాధించే లక్ష్యంగా ఈ సమావేశాలను ఏర్పాటు చేసింది. న్యూఢిల్లీలోని ఎన్‌సీఈఆర్‌టీ క్యాంపస్‌లో నాలుగు రోజుల పాటు ఈ సమావేశాలను నిర్వహించారు. ఈ సమావేశాలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌, ఒడిశా, మహారాష్ట్ర, కర్ణాటక, హిమాచల్‌ప్రదేశ్‌, జమ్ము, కాశ్మీర్‌ నుంచి అయిదుగురు సభ్యులకు పాల్గొనేందుకు అవకాశం కల్పించారు. తెలంగాణ నుంచి పాల్గొనేందుకు అయిదు మంది సభ్యులకు అవకాశం కల్పించగా అందులో తెలంగాణ రాష్ట్ర నుంచి రాష్ట్ర టాస్క్‌ఫోర్స్‌మెంబర్‌గా రాయదుర్గం హెచ్‌ఎం ఎస్‌కే తాజ్‌బాబుకు అవకాశం కల్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నందుకు సర్టిఫికెట్‌ అందించారన్నారు.

వారాహి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు

రాయదుర్గం: గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో వారాహి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు నిర్వహించేందుకు ఆలయంలో నిర్వహిస్తారు. ఈనెల 19 నుంచి 27వ తదీ వరకు ఈ నవరాత్రి ఉత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. అంతేకాకుండా శివసాయిక్షేత్రంలో జూన్‌లో నిర్వహించే పూజలను శనివారం ఆలయ మేనేజింగ్‌ ట్రస్టీ వాసిరెడ్డి పార్వతి ప్రకటించారు. 16న మాస శివరాత్రి, విశ్వేశ్వర స్వామి వారికి ఉదయం 6 గంటలకు మహన్యాసపూర్వక ఏకదశ రుద్రాభిషేకం, రుద్రహోమం, 19న ఆరుద్ర నక్షత్ర శివ అభిషేకం, 23న ఉదయం 7గంటలకు అమ్మవారి అభిషేకం, పసుపు, కుంకుమ అలంకారం, అర్చన, వారాహి అమ్మవారి మండప పూజ, హోమం నిర్వహిస్తారు. 24న సుబ్రహ్మణ్య స్వామి వారికి స్కందషష్టి అభిషేకం, 26న కాలభైరవ అభిషేకం, 29న తొలి ఏకాదశి, గణపతి విశ్వేశ్వరస్వామి, ధన్వంతరి స్వామి వారికి అభిషేకం, అలంకారం చేస్తారు.

పౌర సరఫరా కేంద్రాన్ని తనిఖీ చేసిన కార్పొరేటర్‌



మియాపూర్‌: చందానగర్‌ డివిజన్‌ పరిధిలోని వేమనరెడ్డి కాలనీలో గల పౌర సరఫరా కేంద్రాన్ని చందానగర్‌ కార్పొరేటర్‌ మంజుల రఘునాథ్‌రెడ్డి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ జరుగుతున్న నిత్యావసర సరుకుల పంపిణీని పరిశీలించారు. ప్రభుత్వం అందిస్తున్న నిత్యావసర సరుకులు ప్రజలకు సరిగ్గా అందుతున్నాయా లేదా పౌర సరఫరా కేంద్రానికి వచ్చిన ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎక్కడ లేని విధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు సన్నబియ్యం అందించడం జరుగుతుందన్నారు. చందానగర్‌ డివిజన్‌ బీఆర్‌ఎస్‌ అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి, బీఆర్‌ఎస్‌ పార్టీ నాయకులు నరేందర్‌ బల్లా, కాలనీవాసులు తదితరులున్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి ప్రదర్శన



కూచిపూడి నృత్యం చేస్తున్న కళాకారులు

మాదాపూర్‌: కళాకారులు కూచిపూడి నృత్యప్రదర్శనతో సందర్శకులను అలరించారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాల్లో భాగంగా శనివారం జ్యోతిక శాక్షేత్రం గురువు జ్యోతిరెడ్డి శిష్యబృందంచే కూచిపూడి నృత్యప్రదర్శనను ప్రదర్శించి అలరించారు. ఇందులో గణనాథాయ, శ్లోకాలు, రాజశ్రీ శబ్దం, సరస్వతి స్తుతి, తిల్లాన, తరంగం తదితర అంశాలను ఐశ్వర్య, యువశ్రీ, తనుశ్రీద్రాక్షాయని, తరిష్యరెడ్డి, నైనిక, అమేయ, అక్షర, శృతి, నికిత, లలిత, ప్రజ్ఞ తదితరులు పాల్గొని ప్రదర్శించారు. పుల్లారెడ్డిస్‌ చారిటబుల్‌ ట్రస్టు చైర్మన్‌ సుబ్బారెడ్డి కళాకారులను ప్రోత్సహించారు. గాత్రం రవికాంత్‌, మృదంగం, నాగేశ్వర్‌రావు, వేణువు ప్రకాశ్‌, వయోలిన్‌ అనిల్‌లు సంగీత సహకారాన్ని అందించారు.

గడప గడపకూ బీజేపీ రవన్న ప్రజాయాత్ర



హఫీజ్‌పేట్‌: మార్తాండనగర్‌లో గడప గడపకూ బీజేపీ రవన్న ప్రజాయాత్ర శనివారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు తెలియజేస్తూ, బీఆర్‌ఎస్‌ ప్రభుత్వ అవినీతిని ప్రజలకు వివరించారు. ఈ ప్రజాయాత్రలో గచ్చిబౌలి కార్పొరేటర్‌ గంగాధర్‌రెడ్డి, నాయకులు ఆంజనేయులు, బాలాజీ, బాలు, మహేందర్‌, శ్రీనివాస్‌, నవీన్‌ రెడ్డి, గణేష్‌, అనిల్‌, కార్తీక్‌, రాజు, చంద్రశేఖర్‌ యాదవ్‌, రాధాకృష్ణ యాదవ్‌, ఎల్లేష్‌, కిరణ్‌, రమేష్‌, మధు యాదవ్‌, నరేష్‌, కుమార్‌, రాంరెడ్డి, మన్యం కొండ సాగర్‌, రవి ముదిరాజ్‌, అశోక్‌, నర్సింహా, రాజేష్‌, ఆత్మారామ్‌ పాల్గొన్నారు.

అలరించిన 'పైప్‌ బ్యాండ్‌ మ్యూజిక్‌'



మాదాపూర్‌: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది కార్యక్రమాల్లో భాగంగా శనివారం మాదాపూర్‌లోని శిల్పారామంలోని నటరాజ గార్డెన్‌లో పైప్‌ బ్యాండ్‌ కార్యక్రమాన్ని నిర్వహించారు. సైబరాబాద్‌ పోలీస్‌, డోగ్ర రెజిమెంట్‌ సికింద్రాబాద్‌ సంయుక్తంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీస్‌రంగం ఎంతో ఘనత సాధించిందన్నారు. తొమ్మిది సంవత్సరాలు సాధించిన ఘనతని, ఫ్రెండ్లీ పోలీస్‌ విధానం విజయవంతంగా ఉండడానికి పోలీస్‌ అధికారులు కిందిస్థాయి నుంచి పై వరకు పర్యవేక్షణ చేయడం వల్లనే సాధ్యమవుతుందన్నారు. మాదాపూర్‌ డీసీపీ శిల్పవల్లి తదితరులు పాల్గొన్నారు.

ఫైనల్‌కు నాసర్‌బాయ్స్‌ స్కూల్‌-ఫ్యూచర్‌ కిడ్స్‌ స్కూల్‌



గచ్చిబౌలిలోని నాసర్‌ స్కూల్‌లో నిర్వహించిన ఫుట్‌బాల్‌ టోర్నీ

రాయదుర్గం: సీఐఎస్‌సీఈ స్కూల్స్‌ ఫుట్‌బాల్‌ టోర్నీ అండర్‌-17 విభాగం ఫైనల్‌కు రెండు జట్లు చేరాయి. నాసర్‌బాయ్స్‌ స్కూల్‌ జట్టు, ఫ్యూచర్‌కిడ్స్‌ స్కూల్‌ జట్టు రెండూ ఫైనల్‌కు చేరాయి. ఈ పోటీ ఆదివారం నిర్వహిస్తారు. సీఐఎస్‌సీఈ స్కూల్స్‌ ఫుట్‌బాల్‌ టోర్నీలో అండర్‌-17 విభాగంలో సెమీ ఫైనల్‌కు నాసర్‌బాయ్స్‌ స్కూల్‌-హెచ్‌పీఎస్‌ బేగంపేట్‌, నానక్‌రాంగూడ ఫ్యూచర్‌ కిడ్స్‌-షేక్‌ పేట్‌ ఇంటర్నేషనల్‌ స్కూల్‌ జట్లు చేరుకున్నారు. మొదటి సెమీ ఫైనల్‌లో నాసర్‌బాయ్స్‌ స్కూల్‌ జట్టు, హెచ్‌పీఎస్‌ బేగంపేట్‌ జట్ల మధ్య సాగింది. ఇందులో 1-0 స్కోరుతో నాసర్‌బాయ్స్‌ స్కూల్‌ జట్టు విజయం సాధించి ఫైనల్‌కు చేరింది. రెండో సెమీ ఫైనల్‌ పోటీలో ఫ్యూచర్‌కిడ్స్‌-షేక్‌పేట్‌ ఇంటర్నేషనల్‌ స్కూల్‌ జట్ల మధ్య సాగింది. ఈ మ్యాచ్‌ హోరాహోరీ సాగినా ఫలితం తేలకపోవడంతో పెనాల్టీ షూట్‌ఔట్‌కు అవకాశం కల్పించగా అందులో ఫ్యూచర్‌కిడ్స్‌ జట్టు విజయం సాధించి ఫైనల్‌కు చేరింది.

అండర్‌-14 ఫుట్‌బాల్‌ విజేత హెచ్‌పీఎస్‌ బేగంపేట్‌..

నాసర్‌ బాయ్స్‌ స్కూల్‌లో నిర్వహించిన సీఐఎస్‌సీఈ ఫుట్‌బాల్‌ టోర్నీ అండర్‌-14 బాలుర విభాగంలో విజేతగా హెచ్‌పీఎస్‌ బేగంపేట్‌ నిలిచింది. ఫైనల్‌కు చేరిన హెచ్‌పీఎస్‌ బేగంపేట్‌, నాసర్‌ బాయ్స్‌ స్కూల్‌ జట్లు చేరాయి. ఈ పోటీ హోరాహోరీగా సాగింది. అయినా ఫలితం తేలకపోవడంతో పెనాల్టీ షూట్‌ఔట్‌కు అవకాశం కల్పించారు. ఇందులో 8-7 స్కోరుతో హెచ్‌పీఎస్‌ బేగంపేట్‌ విజేతగా నిలిచింది. మూడో స్థానంలో నానక్‌రాంగూడలోని ఫ్యూచర్‌కిడ్స్‌ స్కూల్‌ ఫుట్‌బాల్‌ జట్టు నిలిచింది.

దైవభక్తితో మానసిక ప్రశాంతత

పటాన్‌చెరు టౌన్‌: దైవ భక్తితో మానసిక ప్రశాంతత లభిస్తుందని బీఆర్‌ఎస్‌ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్‌ అన్నారు. అమీన్‌పూర్‌ మండల పరిధిలోని పటేల్‌గూడ గ్రామంలో నూతనంగా నిర్మించిన వీరాంజనేయస్వామి విగ్రహాల ప్రతిష్ఠాపన ఏర్పాటుకు రూ.2లక్షలను విరాళంగా అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ అనేక సేవా కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు నీలం మధును ఘనంగా సన్మానించారు. ఆలయ కమిటీ చైర్మన్‌ రాకేష్‌రెడ్డి, ఉపాధ్యక్షులు ప్రవీణ్‌ మెతుకు, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌, నాయకులు పటేల్‌ సుధాకర్‌, మహేష్‌ పటేల్‌, భాస్కర్‌ బాచి, రమేష్‌, వెంకటకృష్ణ, శ్రీనివాస సకినాల, శ్రీనివాస్‌, హనుమంత్‌రెడ్డి, విష్ణు రెడ్డి, రాజు, పటేల్‌ వినోద్‌, పటేల్‌ రాము, వినోద్‌, రాజుగౌడ్‌, కృష్ణ, అశోక్‌, నరేష్‌, సంతోష్‌, చందు, ఎన్‌ఎమ్‌ఆర్‌ యువసేన సభ్యులు పాల్గొన్నారు.



నీలం మధును సన్మానిస్తున్న ఆలయ నిర్వాహకులు

దేశం మెచ్చిన నేత కేసీఆర్‌

రాష్ట్ర వైద్యఆరోగ్య, ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు



కొల్లూర్‌ పోలీస్‌స్టేషన్‌ ప్రారంభోత్సవంలో మంత్రి హరీశ్‌రావు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): దేశం మెచ్చిన నేత ముఖ్యమంత్రి కేసీఆర్‌ అని రాష్ట్ర వైద్య ఆరోగ్య, ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. శనివారం తెల్లాపూర్‌ మున్సిపాలిటీ పరిధి ఉస్మాన్‌నగర్‌లో ఏర్పాటుచేసిన కొల్లూర్‌ పోలీస్‌ స్టేషన్‌ను ప్రారంభించారు. తర్వాత తెల్లాపూర్‌లో నూతనంగా నిర్మిస్తున్న శ్రీమల్లిఖార్జునస్వామి, శ్రీబీరప్ప స్వామి, విశ్వకర్మ దేవాలయాల నిర్మాణాలకు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌ రెడ్డిలో కలసి భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్‌ ప్రజల రక్షణకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని, అందులో భాగంగా నూతన పోలీస్‌స్టేషన్‌లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తెల్లాపూర్‌ మున్సిపాలిటీ శరవేగంగా అభివృద్ధి చెందుతోందని దానిని దృష్టిలో పేట్టుకొని ప్రభుత్వం కొల్లూర్‌ నూతన పోలీస్‌స్టేషన్‌ మంజూరు చేసినట్లు తెలిపారు. తెల్లాపూర్‌లో మల్లికార్జున స్వామి, బీరప్పా స్వామి, విశ్వకర్మ ఆలయాల నిర్మాణానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. విశ్వకర్మ ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌ రెడ్డి రూ.50 లక్షలు ఇవ్వడం సంతోషకరమన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మంత్రి హరీశ్‌రావు సిద్దిపేటతో సమానంగా పటాన్‌చెరు నియోకకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నారని కొనియాడారు. పటాన్‌చెరు పట్టణంలో మంత్రి సహాయ సహకారాలతో త్వరలో రూ.300 కోట్లతో సూపర్‌ స్పెషాలిటీ ఆస్పత్రికి శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో కలెక్టర్‌ డాక్టర్‌ శరత్‌, సైబరాబాద్‌ సీపీ స్టీఫెన్‌ రవీంద్ర, మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ లలితా సోమిరెడ్డి, మాదాపూర్‌ డీసీపీ శిల్పవల్లి, తెల్లాపూర్‌ మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ రాములు గౌడ్‌, రామచంద్రాపురం కార్పొరేటర్‌ పుష్పనగేష్‌, కౌన్సిలర్‌ పాల్గొన్నారు.